

జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఆసిఫాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. జిల్లాలో ఆదివారం 41.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. కెరమెరిలో 41.3, బెజ్జూరులో 41.2, ఆసిఫా బాద్, చింతలమానేపల్లిలో 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెంచికలపేట, రెబ్బె నలలో 40.9, దహెగాంలో 40.7, తిర్యాణి, కౌటాలలో 40.6, సిర్పూర్(టి)లో 40.5, కాగజ్‌నగర్‌లో 40.4, వాంకిడిలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పండగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

ఆసిఫాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. స్థానికంగా ఆదివారం ఎస్పీ మాట్లాడారు. ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్ట పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలందరు సోదరభావంతో తమ పండగలు సుఖసంతోషాలతో, కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు. సామాజిక మాధ్యమాల్లో ఒకరిని కించపరిచే విధంగా పోస్టులు పెట్టకూడదని సూచించారు. సోషల్ మీడియాపై పోలీసు నిఘా ఉంటుందని, ఎవరైనా అనుచిత పోస్టులు పెడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గణపతిశర్మకు సాహితీ పురస్కారం


కార్యక్రమంలో పాల్గొన్న కవులు, సభ్యులు

కాగజ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సామల సదాశివ సాహితీ పురస్కారం-2024ను ప్రఖ్యాత రచయిత బ్రహ్మశ్రీ గట్టు గణపతిశర్మకు ప్రఖ్యాత కవి సామల రాజవర్ధన్ అందజేశారు. స్థానిక పద్మశాలి భవన్‌లో డాక్టర్ సామల సదాశివ సాహితీ పురస్కార వేడుకల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రఖ్యాత కవి డాక్టర్ సామల రాజవర్ధన్ మాట్లాడుతూ సామల సదాశివ మాస్టారు సాహితీ దిగ్గజమన్నారు. ఆయన రచనలు ఎంతగానో ప్రఖ్యాతి చెందాయని అన్నారు. డాక్టర్ పట్వర్ధన్ శతావధాని మాట్లాడుతూ సామల సదాశివ మాస్టారు రచనలు దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు కవులు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, కొమేర రాజేశ్వర రావు, సీతా చరితం, కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.లక్ష్మి నరసింహ, పెండ్యాల కిషన్ శర్మ, మధూకర్, ముద్దు రాజేంద్ర ప్రసాద్, మామిడాల తిరుపతయ్య, శ్యాంసుందర్, ఎంతఊట ప్రభాకర్, తోట రమేష్, డి.వేణుగోపాల్, చిలూకూరి సత్యనారాయణ, శంకర్, సత్యనారాయణ గౌడ్, విజయరావు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

» ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు » పాలొన్న ప్రజలు, నాయకులు


ఆసిఫాబాద్‌లో వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న రైతులు

ఆసిఫాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని ఆయా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వయవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేశ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్‌లో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్మికులకు, సిబ్బంది ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజక వర్గ ప్రజలకు ఉగాది పండగ శుభాకాక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మారుతి, బాలేష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణ, మండలంలో ఆదివారం ఉగాది పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి వివిధ ఆలయాల్లో భక్తులు పూజలు చేసేందుకు రావటంతో రద్దీ పెరిగింది. షడ్రుచులతో కూడిన పచ్చడి తీసుకున్నారు. అనంతరం పంచాంగ శ్రావణ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. మండలంలోని ఈసుగాం శివమల్లన్న ఆలయంలో వేద పండితులు నరహరిశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రావణ కార్యక్రమాన్ని చేపట్టారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. కైరిగూడ ఉపరితల గని ఆవరణలో ఉన్న శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ్ భాస్కర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల పంచాంగ శ్రవణం నిర్వహించారు. పలు గ్రామల్లోని రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో పూజలు నిర్వహించి వ్యవసాయ పనులను ప్రారంభించారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉగాది సందర్భంగా రైతులు తమ వ్యవసాయ పనులను శ్రీకారం చుట్టారు. ఎడ్లను శుభ్ర పరిచి నైవేద్యం పెట్టారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉగాది వేడుకలను ప్రజలు ఘనం గా నిర్వహించారు. మండలంలోని పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జమాల్‌పూరి సుధాకర్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలోని టోంకిని సిద్ధిహనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు గంగు సత్యనారాయణ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థినులకు పచ్చడి అందజేశారు. సాయంత్రం ఆలయాల్లో పురోహితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో పురోహితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. కర్జవెల్లి గ్రామంలోని గీతా మందిర్ ఓంకార ఆశ్రమంలో ఎస్సై ఇస్లావత్ నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలకు వెళ్లి పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు న్విహించారు. ఈ సందర్భంగా షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని సేవించారు. సాయంత్రం ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు.


సిర్పూర్(టి)లో పచ్చడి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు


కైరిగూడలో పూజలు చేస్తున్న జీఎం విజయ్‌భాస్కర్‌రెడ్డి


దహెగాంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న పురోహితులు


వాంకిడిలో పచ్చడి పంపిణీ చేస్తున్న నాయకులు

- ప్రమాదంలో ప్రజా ఆరోగ్యం
- పల్లె, పట్టణాల్లో విచ్చలవిడిగా వినియోగం
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు



బెజ్జూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కాలుష్యం భూతంలా విరుచుకుపడుతోంది. ప్లాస్టిక్ ఆరోగ్యానికి ప్రమాదకరమని,వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా ప్రజలు వినియోగిస్తున్నారు. ఇంటి బయట ఏది తిన్నా తెలియకుండానే ప్లాస్టిక్‌పై ఆధారపడాల్సి వస్తుండడంతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ (ఎస్‌యూపీ) వ్యర్థాలను పూర్తిగా నిషేధిత జాబితా లోకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చాయి. దీన్ని పకడ్బందీగా అమలు చేయాలని చెప్పినా అధికారులు తనిఖీలకే పరిమితమవుతున్నారు.

ఎక్కడికి వెళ్లినా..

గుడికి, బడికి, బజారుకు, కిరాణం షాపుకు, హోటళ్లకు పోయినా, మార్కెట్‌కు వెళ్లినా...ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లతోనే కనిపిస్తున్నారు. అంతలా ప్రస్తుతం మానవ జీవితంలో ప్లాస్టిక్ ఒక భాగమైంది. మానవాళితో పాటు పర్యావరణా నికి కీడు చేస్తున్న ప్లాస్టిక్(ఒక్కసారి వాడి పారేసే వివిధ రకాల వస్తువులను) బ్యాన్ చేయాలని అప్పట్లో కేంద్ర ప్రభు త్వం నిర్ణయించింది. దీన్ని వెంటనే నిషేధించా లని ఆదేశాలు జారీ చేసింది. గతంలో 75మైక్రాన్ల లోపు మందం గల ప్లాస్టిక్‌ను వినియోగించకూడదనే నిబంధనలు ఉన్నా వాటిని ఎవరు పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం 120 మైక్రాన్ల మందం ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగించ కూడదని ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధనలు పాటించడం లేదు.

అడ్డు అదుపు లేకుండా..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో నిషేధిత ప్లాస్టిక్‌ను అడ్డు అదుపు లేకుండా వినియోగిస్తున్నారు. కిరాణం, సూపర్ మార్కెట్లు, హోటళ్లు, పండ్ల దుకాణాలు, చిరువ్యాపారులు, చికెన్ సెంటర్లు, చేపలు విక్ర యించేవారు, తదితర లావాదేవీల్లో ప్లాస్టిక్‌ను అడ్డు అదుపు లేకుండా వినియోగిస్తు న్నారు. ఈ ప్లాస్టిక్ మూలంగా పర్యావరణం దెబ్బతింటుంది. 75 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్ కవర్లను వాడకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ వ్యాపారులు గ్రామాల్లో, పట్టణాల్లో విచ్చలవిడిగా అమ్ముతున్నారు. ప్రజలు వాటిని వినియోగిస్తు న్నారు. దీన్ని నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. క్యారీ బ్యాగులు, బెలూన్స్, ఐస్‌క్రీం స్పూన్స్, ఇయర్ బడ్స్ స్టిక్స్, ప్లెక్సీలు, స్వీట్ బాక్సుల ప్యాకింగ్ కవర్లు, సిగరేట్ ప్యాకెట్స్, వాటర్ బాటిళ్లు, డిస్పోజబుల్ గ్లాసులు నిషేధించాల్సిన అవసరం ఉన్నప్పటికీ అవి కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవం లేద ని చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలేవి..

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తే వాటి స్థానంలో జూట్ బ్యాగులను, క్లాత్ బ్యాగులను అందుబాటులో ఉంచాలి. అయితే అలాంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఎవరూ చూపడం లేదు. సేంద్రియ పత్తి, వెదురు, చెక్కమట్టి పింగాణీ, ప్రకృతిలో త్వరగా కలిసిపోయే ప్లాస్టిక్‌తో చేసిన వస్తువులను వాడాలి. మట్టి, పింగాణీ పాత్రలను ఆహారం నిల్వ చేయడానికి వినియోగించు కోవచ్చు. ప్రకృతిలో త్వరగా కలిసిపోయే కంపోస్టబుల్ కవర్లను చెత్తబుట్టలో వాడే కవర్లుగా, కాగితపు కప్పులకు వాడే పైపూతగా, పండ్లు, ఆహార పదార్థాలు, హోటళ్లలో పార్శిళ్లకు, పంట పొలాల్లో మట్టిని కప్పేందుకు తదితర వాటికి వీటిని వాడుకోవచ్చు. కానీ ప్రస్తుతం వీటి తయారీలు దేశంలో ఎక్కడా కనిపించడం లేదు.

ఏ దుకాణంలో చూసినా..

జిల్లా వ్యాప్తంగా పదిహేను మండలాల పరిధిలో. ఏ దుకాణంలో చూసినా, ప్లాస్టిక్ బ్యాగులే దర్శనమిస్తున్నాయి. పైగా ప్రజలు కూడా బ్యాగులు తీసుకెళ్లడం మరిచిపోయారు. అయితే అధికారులు జిల్లాలో నామమాత్రంగానే తనిఖీలు చేపడుతున్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగంపై ప్రజల్లో అవగాహన చర్యలు కల్పించకని కారణంగా వినియోగం పెరిగి పోయింది. కేంద్ర ప్రభుత్వం 2022 జూలై నుంచి పూర్తిస్థాయిలో ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్న ట్లు ఆదేశాలు జారీ చేసింది. కానీ ఇప్పటి వర కు పూర్తిస్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదు. టిఫిన్ సెంటర్లలోనూ ఇడ్లీలను సైతం గుడ్డవేసే కాకుండా ప్లాస్టిక్ కవర్లపై ఉడికిస్తున్నారు. కొబ్బరి బొండాంలో ప్లాస్టిక్ స్ట్రా వేసుకొని తాగడం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వేడి టీని సైతం ప్లాస్టిక్ సంచుల్లో పోయించుకొని, ప్లాస్టిక్ గ్లాసుల్లో తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నారు. వివాహాలు, ఇతర శుభ, అశుభ కార్యాలలో భోజనంతో పాటు తాగునీటి కోసం ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, స్ట్రాలను వాడుతున్నారు. ప్లాస్టిక్ కవర్లలోని రసాయనాలు ఆహారం, ఇతర పానియాల్లో కలిపి హార్మోనుల అసమతుల్యత, పునరుత్పత్తి సమస్యలతో పాటు క్యాన్సర్ వంటి సమస్యలను కలిగిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ ఎన్నికలకు ముందడుగు

కాగజ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ ఎన్నికలకు ఎట్టకేలకు కార్మికశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు డిప్యూటీ లేబర్ కమిషనర్ రాజేశ్వరిని ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి నియమించారు. ఈ మేరకు లేఖనంబరు ఏ/390/2024 తేదీ 26.03.2025 డిప్యూటీ కమిషనర్ ఎస్పీఎం మిల్లులో ఉన్న 15 ట్రేడ్ యూనియన్లకు నోటీసులను పంపించారు. ఈ నోటీసుల్లో సంఘానికి సంబంధించిన అండర్ టేకింగ్ సర్టిఫికెట్స్, అఫ్లిషియేన్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, బైలాస్, అన్యూవల్స్ రిటర్న్, లిస్ట్ ఆఫ్ మెబర్ షిప్, ఎకౌంట్ రిజిస్టర్, రిసిప్ట్ బుక్స్, బ్యాంకు ఖాతాలు, మినిట్స్ రిజిస్ట్రర్స్ వివరాలను వచ్చే నెల 3లోగా లేబర్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఎన్నికలకు అడుగులు పడుతుండడంతో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏడేళ్లుగా నిరీక్షణ..

ఎస్పీఎం మిల్లు 2014లో బిర్లా యాజమాన్యం షెడ్‌డౌన్ పేరిట మూసివేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో కొత్తగా తీసుకున్న జేకే యాజమాన్యంతో అన్నీ రాయితీలు ఇచ్చి పునఃప్రారంభించింది. కార్మికులు తమకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్న కొండంత ఆశతో ఎదురు చూసినప్పటికి రోజురోజుకు పరిస్థితులు మారాయి. మిల్లు పునరుద్ధరణ సమయంలో అందరిని కార్మికులను తీసుకోవాల్సి ఉంది. కానీ యాజమాన్యం మాత్రం అవసరం ఉన్న వారినే తీసుకుంది. ఇంకా 200 మందిని విధుల్లోకి తీసుకోలేదు. విధుల్లోకి తీసుకోని వారు హైదరాబాద్‌లో లేబర్ కార్యాలయలంలో కలిసి ఫిర్యాదు చేశారు. కానీ యాజమాన్యం మొండి వైఖరి వీడనాడలేదు. కార్మిక సంఘం లేక పోవడంతోనే యాజమాన్యం తమను అణగదొక్కుతోందని, వెంటనే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని పోరుబాట పట్టారు. గత ఏడాది నుంచి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లేబర్ అధికారుకు వినతి పత్రాలు అందజేశారు. ఇటీవల ఎమ్మెల్యే సైతం విషయం అసెంబ్లీలో ప్రస్తావించారు. ఇప్పటికైనా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు

సిర్పూర్(టి) మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత, కొత్త ఈద్గా మైదానాల్లో సోమవారం నిర్వహించే రంజాన్ పండగ కోసం ఈద్గాల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పాత ఈద్గాలో 8.30 గంటలకు ప్రార్ధనలు నిర్వహించనున్నారు. కొత్త ఈద్గాలో 9 గంటలకు ప్రార్ధనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జాతర పోస్టర్ల ఆవిష్కరణ

రెబ్బెన, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం ఇందిరానగర్‌లో వచ్చే నెల 12, 13 తేదీల్లో నిర్వహించే మహంకాళి అమ్మవారి జాత పోస్టర్లను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. జాతరను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దేవర వినోద్, ఆలయ అధ్యక్షుడు మోడెం తిరుపతి గౌడ్, కమిటీ సభ్యులు కావుడే సంతోష్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌ఆబు అన్నారు. మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. పోచమ్మ ఆలయానికి ప్రహరిగోడ, చేతి పంపు మంజూరు చేయాలని గ్రామస్థులు ఎమ్మెల్యేను కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎల్కపల్లిలో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. రంగనాయక ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యేను కోలావార్ సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. . కార్యక్రమంలో నాయకులు మనోహర్‌గౌడ్, తిరుపతి, వసీఖాన్, రాకేష్, దిగంబర్, బాలకృష్ణ, భాస్కర్‌రాజు, శ్యాంసుందర్, బాపు, మల్లేష్, బక్కయ్య, సంతోష్, వెంకటేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌లొద్దిలో భక్తుల పూజలు


ప్రవచనాలు బోధిస్తున్న ప్రేమ్‌సింగ్ మహారాజ్

కెరమెరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని పవిత్ర పుణ్యక్షేత్రం శంకర్‌లొద్ది ఉగాది పండగ పర్వదానాన్ని పురస్కరించుకొని జనసంద్రంగా మారింది. ఈ ఉత్సవానికి కెరమెరి, నార్నూర్, ఆసిఫాబాద్, ఉట్నూర్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సేవాలాల్ భక్తులు, బంజారాలు భారీగా తరలి వచ్చారు. శివలింగాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా బంజారాల ఆరాధ్య గురువు ప్రేంసింగ్ మహారాజ్ పాల్గొని భక్తులను ఉద్దేశించి పుణ్య ప్రవచనాలు చేశారు. బంజారాలు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని కోరారు. వ్యసనాల బారిన పడొద్దని చెప్పారు. సాటి మనుషులు పట్ల సోదర భావంతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా బోగ్ బండార్ నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో సేవాలాల్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు రాథోడ్ శంకర్‌నాయక్, శేషారావు, రాందాస్ రాథోడ్, రూప్‌లాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న సేవాలాల్ భక్తులు

రైతులకు ప్రయోజనం చేకూరేలా పనులు

మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: రైతులకు ప్రయోజనం చేకూరేలా ఈజీఎస్ పథకంలో ఏం పనులు చేపడుతున్నారు?

ఏపీవో: రైతులకు ప్రయోజనం చేకూరేలా ఈజీఎస్ పథకంలో పలు రకాల పనులు చేపడుతున్నాం. పశువుల పాకలు, పండ్ల తోటలు పెంచేందుకు చేనులలో ఈజీఎస్ పథకం ద్వారా మట్టి రోడ్డు నిర్మాణం తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి?

ఏపీవో: మండల వ్యాప్తంగా 6,852 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 11,630 మంది కూలీలు ఉన్నారు. 3,560 జాబ్ కార్డులు యాక్టీవ్‌లో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: కూలీలకు డబ్బులు అందించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఏపీవో: క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ నిబంధనల ప్రకారం పని చేసిన వారికి తప్పకుండా డబ్బులు వస్తాయి. రాని వారు గ్రామ స్థాయిలో ఎఫ్‌లకు, మండల స్థాయిలో ఏపీవోకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటారు.

ఆంధ్రజ్యోతి: ఐహెచ్ఎల్, ఇంకుడు గుంతలు నిర్మించుకున్న వారికి పేమెంట్స్ సరిగ్గా రావడం లేదని చెబుతున్నారు?

ఏపీవో: క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బందిలో కొంత నిర్లక్ష్యం కనబడుతోంది. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. ఫార్మట్ ప్రకారం ఐహెచ్ఎల్, ఇంకుడు గుంతలు నిర్మించుకున్న వారికి డబ్బులు అందజేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- కెరమెరి, ఆంధ్రజ్యోతి

మూత్రశాలలు కరువు

- జిల్లా కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణంపై అధికారుల ఉదాసీనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఆసిఫాబాద్ పట్టణం

ఆసిఫాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా మారినా మూత్రశాలల నిర్మాణంపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. గ్రామ పంచాయతీ నుంచి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా, మున్సిపాలిటీగా మారడంతో ఆయా మండలాల నుంచి ప్రజల రాకపోకలు పెరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపారాలు పెరుగడంతో పనుల నిమిత్తం ప్రజలు రావల్సిన అవసరం ఉంటోంది. ఆసిఫాబాద్‌కు వచ్చిన ప్రజలకు పట్టణంలో ఎక్కడ కూడా మరుగుదొడ్డి లేక పోవడంతో మలమూత్ర విసర్జన తీవ్ర సమస్యగా మారింది.

జిల్లా కేంద్రంలోని ప్రజలే కాదు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చినా గంటల తరబడి ఉగ్గబట్టుకోవాల్సిందే. అత్యవసరమైన మూత్ర శాలలు, మరుగుదొడ్లు నిర్మించాల్సిన అధికారులు, నాయకులు పట్టించుకోడం లేదని ప్రజలు వాపోతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో బహిరంగ ప్రదేశాల్లోనే మగవారు విసర్జిస్తున్నారు. ఆత్మగౌరవానికి సంబంధించిన ఆడవారి విషయంలో ఇది తీవ్ర సమస్యగా మారుతోంది.

ఆచరణలో పరిస్థితి భిన్నం..

'బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయడం అనాగరికం. కాదని ఆ పని చేస్తే జరిమానా విధించబడును. మనం మారుదాం. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం'. ఇది తరుచూ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో చెబుతున్న మాటలు. కానీ ఆచరణలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పట్టణ పరిధిలో ఎక్కడ కూడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక పోవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ఇక మధుమేహం, ఇతర వ్యాధిగ్రస్తులు అయితే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రధాన కూడళ్లలో ప్రజా మూత్రశాలలు ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కరమయ్యే ఆవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్, గాంధీచౌక్, వివేకనంద చౌక్, గుండి రోడ్డు, జన్కాపూర్, బాబాపూర్ ఎక్స్‌రోడ్డుల వద్ద ప్రజా మూత్రశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి..

దినకర్, సీపీఎం జిల్లా నాయకుడు



జిల్లా కేంద్రమైన ఆసిఫాబాద్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవలి. ప్రజా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక పోవడంతో జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. పలుమార్లు అదికారులకు విన్నవించినా అల సత్వం వహిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

వాగులో బండరాళ్ల మధ్య చిక్కుకుని ఒకరి మృతి

కెరమెరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం శంకర్‌లొద్దిలో ఆదివారం వాగులో స్నానానికి వెళ్లిన ఓ యువకుడు బండరాళ్ల మధ్య చిక్కికుని ఊపిరాడక మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్నూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన శంకర్‌పవర్(18) ఉగాది సందర్భంగా శంకర్‌లొద్ది శివలింగాన్ని దర్శించుకునేందుకు సమీప బంధువుతో వచ్చాడు. ముందుకు సమీపంలోని వాగులో స్నానం చేసేందుకు వెళ్లాడు. అతడితో వచ్చిన వ్యక్తి ఒడ్డుపై బట్టలు పట్టుకుని కూర్చున్నాడు. శంకర్‌పవర్ వాగులోకి స్నానం చేసేందుకు దూకాడు. ఆ ప్రాంతం లోతుగా ఉండి బండరాళ్లు ఉన్నాయి. శంకర్‌పవర్ దూకడంతోనే బండరాళ్ల మధ్య ఇరుక్కుపోయాడు. ఎంత సమయం గడిచినా అతడు బయటకు రాకపోవడంతో ఒడ్డునే ఉన్న వ్యక్తి చుట్టు పక్కల వారికి చెప్పాడు. పలువురు గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై విజయ్ సిబ్బందితో అక్కడికి చేరుకుని గాలింపు చేపట్టగా శంకర్‌పవర్ మృతదేహం లభ్యమైంది. శంకర్‌పవర్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విజయ్ తెలిపారు.

ఆలయంలో కలశ పూజలు

రెబ్బెన, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటిలో ఆదివారం హనుమాన్ ఆలయంలో కలశ పూజ కార్యక్రమాన్నినిర్వహించారు. హనుమాన్ సేవాలాల్ భక్తులు పురవీధుల గుండా కలశంతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ సేవాలాల్ భక్తులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గన్నారు.

నెల రోజుల్లో ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ ఎన్నికలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు

కాగజ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల్లో సిర్పూరు పేపర్ మిల్లులో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తారని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. వివిధ ట్రేడ్ యూనియన్ సంఘాల నాయకులు, కార్మికులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని నాలుగు రోజుల క్రితం తాను అసెంబ్లీలో ప్రస్తావించానని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించి డిప్యూటి కమిషనర్ ఆఫ్ లేబర్ ఆదిలాబాద్ అధికారిని రిటర్నింగ్ అధికారిగా నియమించిందని అన్నారు. తప్పకుండా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఎస్పీఎంలో యాజమాన్యం వేధింపులు, కార్మికుల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించినందుకు పలు సంఘాల నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఆయా ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే హరీష్ బాబు అన్నారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

ఘనంగా గన్‌గోర్ పూజలు



అలంకరించిన శివపార్వతులు

కాగజ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో గన్‌గోర్ పూజలు స్థానిక అగ్రసేన్ భవన్‌లో నిర్వహించారు. స్థానిక హనుమాన్ ఆలయంలో శివపార్వతుల విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అగ్రసేన్ భవన్‌లో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల్ భారతీయ మార్వడ మహిళ సమ్మేళన్, రాజస్థాన్ ప్రగతీశీల్ మహిళ మండలి సభ్యులతో పాటు ఆయా మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం కోసం ఊరేగింపుగా వస్తున్న మహిళలు

బాల వికాస్ కేంద్రం ఏర్పాటు


కాగజ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భట్టుపల్లి చౌరస్తాలో ఆదివారం బాల వికాస్ కేంద్రాన్ని భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు జనార్దన్, జిల్లా విద్యా విభాగం కోఆర్డినేటర్ భార్గవి, జిల్లా మహిళా కోఆర్డినేటర్ రమాదేవి, కాగజ్‌నగర్ శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నాగేశ్వర్‌రావు, సమితి సభ్యులు శ్రీనివాస్, శైలజ పాల్గొన్నారు.

నీటి కోసం తిప్పలు

దహెగాం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీరు సరిపడా రాక పోవడంతో మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీ ప్రజలు వ్యవసాయ పంపు సెట్ల నీటిని బిందెలు, డ్రమ్ములతో తీసుకెళ్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

మంచిర్యాల క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం అశోక్‌రోడ్డుకు చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి జింక దుర్గయ్య (71) ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎఎస్ఐ సత్తయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జింక దుర్గయ్య మద్యానికి బానిసవడంతో ఆరోగ్యం క్షీణించింది. ఆసుపత్రికి వెళ్లగా లివర్ చెడిపోయిందని వైద్యులు తెలుపడంతో మనస్తాపానికి గురైన దుర్గయ్య ఈ నెల 28న మధ్యాహ్నం భార్య కూరగాయలు అమ్మేందుకు వెళ్లగా ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.



వేతనాలు పెంచాలని వోల్వా డ్రైవర్ల సమ్మె



ఐకే ఓసీపీ వద్ద శాంతియుత సమ్మె చేస్తున్న వోల్వా డ్రైవర్లు

జైపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం ఓపెన్ కాస్టు గనిలో ఓబీ మట్టి టెండర్లు దక్కించుకున్న వరహా కంపెనీలో పనిచేస్తున్న వోల్వా డ్రైవర్లు ఆదివారం నుంచి శాంతియుత సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన కంపెనీ యాజమాన్యానికి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వినతి పత్రం అందించామన్నారు. కంపెనీ యాజమాన్యం స్పందించడం లేదన్నారు. చాలీ చాలని వేతనాలతో కుటుంబాల పోషణ ఇబ్బందిగా మారిందని చెప్పారు. అందుకే శాంతియుత సమ్మె చేపడుతున్నామని తెలిపారు. గతంలో కూడా సమ్మె చేస్తే అధికారులు వేతనాలు పెంచేలా చర్యలు తీసు కుంటున్నామని చెబుతున్నారని, అమలు చేయడం లేదని వాపోయారు. సింగరేణి యాజమాన్యం వరహా కంపెనీతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరిక



ప్రతిజ్ఞ చేస్తున్న కార్మికులు, అధికారులు

మందమర్రిటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలో కేకే 5గని 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రెండు 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరుకుంది. మార్చి 31తో ఉత్పత్తి లక్ష్యం ముగియనుంది. కానీ ఈ గనిలో వారం రోజుల ముందుగానే లక్ష్యాన్ని సాధించింది. అదనంగా 6వేల ఉత్పత్తిని సాధించింది. గతంలో కార్మికులతో ఉత్పత్తిపై ప్రతిజ్ఞ చేయించారు. మూడేళ్లుగాఈ గని నిర్దేశించిన లక్ష్యంగా పదివేలకు పైగా అదనపు ఉత్పత్తిని సాధిస్తోంది. సింగరేణి సీఅండ్ఎండీ బలరాంతోపాటు ఇతర డైరెక్టర్లు కూడా కార్మికులను, ఉద్యోగులను అభినందిస్తున్నారు. దశాబ్దకాలంగా ఈ గనిలో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఈ గని రెండు జాతీయ రక్షణ అవార్డులతో పాటు రీజియన్ ఏరియా స్థాయి అవార్డులు సైతం సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి గని మేనేజర్ రమేశ్ మాట్లాడుతూ కార్మికుల అధికారుల సమష్టి కృషి వల్లే ఈ ఆర్థిక సంవత్సరం కూడ లక్ష్యాన్ని అధిగమించామన్నారు ప్రమాదాలు జరుగకుండా పకడ్బందీ రక్షణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

స్త్రీనిధిలో కానరాని మహిళా సాధికారత

- మహిళా సంఘాల యూనిట్లపై నిర్లక్ష్యం
- ఏళ్లు గడుస్తున్నా అందని బీమా పరిహారం
- పట్టించుకోని అధికారులు

కాసిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి అన్ని రంగాల్లో ముందుంచేందుకు ప్రభుత్వం ఎన్నో సంస్కరణలను చేపడుతోంది. మహిళల అభివృద్ధి సంక్షేమం, మహిళ సాధికారత కోసం ఏర్పడిన స్వయం సహాయక సంఘాలు మాత్రం తిరోగమనంలో పయనిస్తూ మహిళలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహిళా సంఘాలు బ్యాంకు లింకేజీతో పాటు స్త్రీనిధి నుంచి స్వయం ఉపాధికి ఆర్థిక తోడ్పాటును అందించేందుకు రుణాలు అందజేస్తారు. ఇందులో మిల్క్ డైరీ ఫాం ఏర్పాటు చేసేందుకు గేదెల కొనుగోలు కోసం రుణాలు అందజేయడం ప్రధాన ఉద్దేశ్యం. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో మిల్క్ యానిమల్స్ 300 యూనిట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా కేవలం 28 యూనిట్లు మాత్రమే ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. లబ్దిదారుల గేదెలు మృతిచెందితే బీమా చెల్లించడంలో అధికారులు వహిస్తున్న నిర్లక్ష్యం ఒక కారణం అయితే గేదెలను ఇతర రాష్ట్రాల్లోనే కొనుగోలు చేయాలనే నిబంధన పెట్టడంతో ఈ పథకం నీరుగారిపోయింది.

లక్ష్యానికి దూరంగా..

ఈ ఆర్థిక సంవత్సరంలో 300 మంది మహిళలకు గేదెలను పంపిణీ చేసి పాల ఉత్పత్తిని పెంచాలనే ఉద్దేశ్యంతో లక్ష్యాన్ని నిర్దేశించారు. అధికారుల సమన్వయ లోపం కారణంగా ఈ పథకం నీరు గారి పోయింది. రాష్ట్రంలో పాల దిగుబడి పెంచేందుకు గేదెలను ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాలనే నిబంధన లబ్దిదారులకు కొంత ఇబ్బంది కరంగా మారింది. పొరుగు రాష్ట్రా లైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి గేదెలను కొనుగోలు చేస్తే లబ్దిదా రులకు రవాణా చార్జీలు అదనపు భారంగా మా రాయి. స్త్రీనిధి నుంచి గేదెలను కొనుగోలు చేసేందుకు రూ. 85,200 రుణంగా చెల్లిస్తుంది. కానీ నేడు మార్కెట్‌లో మేలు రక మైన గేదె ధర రూ. 1.20 లక్షల నుంచి 1.50 లక్షల వరకు పలు కుతోంది. ఇలా రవాణా చార్జీలతో పాటు గేదెలకు అదనపు ఖర్చులు చెల్లించడంతో లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు పడు తుండడంతో గేదెల కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లాన మాఖ్యలో 468 గ్రామైక్య సంఘాలుం డగా 10210 స్వయం సహాయక సంఘాలున్నాయి. అలాగే వికలాం గుల సంఘాలు 219 ఉన్నాయి. 1,15,495 మంది సభ్యులు ఉన్నారు. కానీ మిల్క్ ఆని మల్స్ 20 మందికే ఇవ్వడం గమనార్హం.



మహారాష్ట్రలో గేదెను కొనుగోలు చేస్తున్న లబ్దిదారులు

కొనుగోలు సమయంలో..

లక్షల రూపాయలు విలువ చేసే గేదెను కొనుగోలు చేసినప్పుడే లబ్ధిదారులు బీమా సొమ్మును చెల్లిస్తున్నారు. కానీ ప్రమా దవశాత్తూ గేదె మృతి చెందితే బీమా సొమ్ము చెల్లించడంలో సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గడిచిన మూ డేళ్లలో 18 గేదెలు మృతిచెందితే కేవలం 5 గేదెలకు మాత్రమే బీమా సొమ్ము చెల్లించారు. తెచ్చిన గేదె మృతిచెం దడంతో పాల దిగుబడి ఆదాయం రాబడి లేక అప్పులు చెల్లించలేక మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అప్పులు చెల్లించలేని సభ్యురాలు ఇంటికి వెళ్లి మిగితా సభ్యులు ఆందోళన చేయడంతో అప్పు తీసుకున్న వారు మానసికంగా కంగిపోతున్నారు.

రవాణా ఖర్చులు భారం అవుతున్నాయి

గేదె కొనుగోలు చేయడానికి స్త్రీనిధి నుంచి రూ. 85,200 రు ణం ఇస్తున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి గేదెను తీసుకొచ్చేసరికి రవాణా చార్జీ రూ. 16 వేలు అవుతుంది. ఇంత ఖ ర్చు పెట్టి గేదెను కొనుగోలు చేస్తే రవాణా ఖర్చులు మాకు అద నంగా భారం అవుతున్నాయి. సమీప జిల్లాల్లో గేదెలను కొనుగోలు చేస్తే మాకు రవాణా చార్జీలు తగ్గుతాయి. పాల దిగుబడి కూడా పెరుగుతుంది.

కొలిపాక మల్లేశ్వరి, ధర్మారావుపేట

రీ వెరిఫికేషన్ చేస్తున్నాం

మృతిచెందిన గేదెలపై సంస్థ నుంచి రీవెరిఫికేషన్ చేస్తు న్నాం. మృతిచెందిన గేదెల లబ్దిదారులు ఎలాంటి ఆందోళన చెం దాల్సిన అవసరం లేదు. ఇతర రాష్ట్రాల్లోనే గేదెలను కొనుగో లు చేయాలనేది ప్రభుత్వ నిర్ణయం. మేలు రకమైన గేదెలను కొనుగోలు చేయడంలో లబ్దిదారులు జాగ్రత్త వహించాలి. మిల్క్ ఆని మల్స్ పథకంలో లబ్దిదారుల సంఖ్యను పెంచేందుకు చర్య లు తీసుకుంటాం.

- రవికుమార్, స్త్రీనిధి జోనల్ మేనేజర్

నత్తనడకన సింగరేణి బైపాస్ రోడ్డు పనులు

కాసిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట నుంచి బెల్లంపల్లికి వెళ్లే బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏండ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. 2016లో సింగరేణి రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు ఆహ్వానించింది. 5 ఏళ్ల క్రితం ఆరు కిలోమీటర్ల బీటీ రోడ్డు, 4 బ్రిడ్జిల నిర్మాణానికి గుత్తేదారు రూ. 39 కోట్లకు పనులను దక్కించాడు. ఐదేళ్ల క్రితం పనులను ప్రారంభించిన గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు ముందుకు సాగడం లేదు. మళ్లీ వర్షాకాలం వస్తే స్థానికులకు వాగులు దాటడం కష్టంగా మారుతంది. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణంతో పాటు బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఈఈ హరీష్‌ను వివరణ కోరగా జూన్ నెలాఖరులోగా పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పెద్దనపల్లి నాయకుపుగూడ వాగుపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి

అసంపూర్తిగా మరుగుదొడ్లు



నిలిచిపోయిన సామూహిక మరుగుదొడ్ల పనులు

కాగజ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని తిరందాజ్ థియేటర్ సమీపంలో సాముహిక మరుగుదొడ్ల నిర్మాణం పనులు ఇప్పటికీ పూర్తి చేయడం లేదు. మూడేళ్ల క్రితం మరుగుదొడ్ల పనులు రూ.3లక్షలతో చేపట్టారు. అధికారులు పట్టించుకోక పోవడంతో ఇప్పటికీ పూర్తవడం లేదు. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.. ప్రస్తుతం సాముహిక మరుగుదొడ్ల నిర్మాణం కోసం ట్యాంకు నిర్మాణం బోరింగ్ పనులు పూర్తి చేశారు. అధికారులు పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పన్నుల చెల్లింపుతోనే పట్టణ అభివృద్ధి సాధ్యం

మున్సిపల్ కమిషనర్ రాజలింగు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధిలో ప్రజలందరు భాగస్వాములు కావాలి. పన్నుల వసూళ్లలో జిల్లా వ్యాప్తంగా మందమర్రి మున్సిపాలిటీ రెండో స్థానంలో ఉంది.

ఆంధ్రజ్యోతి : 2024.25 ఆర్థిక సంవత్సరానికి మున్సిపాలిటీ పన్నుల లక్ష్యం ఎంత..?

కమిషనర్ : నిర్దేశించిన లక్ష్యం రెండు కోట్ల 29 లక్షలు. మున్సిపాలిటీలో 24 వార్డులకు పన్నులకు సంబంధించి వార్డు ఆఫీ సర్ల నేతృత్వంలో పన్నుల వసూలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : పన్నులు ఇప్పటి వరకు ఎంత వసూలు చేశారు..?

కమిషనర్ : మార్చి 31తో ఆర్థిక సంవత్సరం పన్నుల గడువు ముగుస్తుంది. ఆదివారం ఉగాది 30వ తేదీన కూడా పన్నుల వసూలు చేస్తున్నాం. ఇప్పటి వరకు కోటి 70 లక్షలు వసూలు చేశాం. ఇంకా 59 లక్షలు వసూలు చేయాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి : మున్సిపాలిటీలో ఎన్ని కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి...?

కమిషనర్ : మున్సిపాలిటీలో రెండు రోజుల క్రితమే కోటి 20 లక్షల పనులకు టెండర్లు పూర్తయ్యాయి. ఆ పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయి. 24 వార్డుల్లో రోడ్లు, డ్రైన్ పనులు చేపడతాం. రోడ్లు లేని వార్డులకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. ప్రజలకు జవాబుదారీగా పని చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

-మందమర్రి, (ఆంధ్రజ్యోతి)

ఆలయ నిర్మాణానికి విరాళం

దండేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలం వెల్గనూర్ గ్రామంలో నూతనంగా నిర్మించే శ్రీరామాలయ నిర్మాణానికి కాసిపేట గ్రామానికి చెందిన ఆశెట్టి వెంకటరమణ రూ. 11,111 విరాళాన్ని అందజేశారు. ఆదివారం ఆలయ కమిటి సభ్యులు అక్కల రవీందర్, ఏసన్న, సంజీవ్, ప్రవీణ్ వర్మ, శ్రీధర్, హరీష్‌లకు విరాళంను అందజేశారు.

డంపింగ్ యార్డు ఏర్పాటు ఎప్పుడో..?



గురిజాల వెళ్లే రహదారిపక్కన ఉన్న చెత్తకుప్పలు

బెల్లంపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మున్సిపాలిటిలో డంపింగ్ యార్డు ఏర్పాటులో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉదాసీనంగా ఉంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పట్టణ శివా రు ప్రాంతాలను డంపింగ్ యార్డు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారే తప్ప డంపింగ్ యార్డు ఏర్పాటు చేయలేదు. దీంతో మున్సిపాలిటిలోని చెత్త రహదారుల వెంట, పలు వార్డుల్లో ఇండ్ల సమీపంలోని కుప్పలుకుప్పలుగా దర్శనం ఇస్తున్నాయి. చెత్త నుంచి వెలువడుతున్న దుర్గంధం పరిసర ప్రాంత వాసులను, రహదారుల గుండా వెళ్లే వాహనదారుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుగుండ వెళ్లాలంటే ముక్కుమూసుకోని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

స్థల పరిశీలనకే పరిమితమవుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు..

బెల్లంపల్లి పట్టణంలో మొత్తం 34 వార్డులు ఉన్నాయి. దాదాపు ప్రతి రోజు రెండు టన్నులకు పైగా వార్డుల్లో ఆటోట్రాలీలతో మున్సిపల్ కార్మికులు చెత్తసేకరణ చేస్తారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో

రహదారుల వెంట వార్డుల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలు

- **స్థల సేకరణలో అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం**
- **ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్న వైనం**

పాలిటెక్నిక్‌కళాశాల శివారులో దాదాపు నాలుగు కోట్ల వ్యయంతో డంపింగ్‌యార్డు నిర్మించారు. కేవలం రెండేళ్లపాటే ఈ డంపింగ్‌యార్డును ఉపయోగించారు. ఈ డంపింగ్‌యార్డు సమీప ప్రాంతం నుంచి ఫుడ్ జోన్ నిర్మాణం కోసం ప్రభుత్వం 340 ఎకరాలు కేటాయించింది. కేటాయించిన స్థలంలోనే డంపింగ్‌యార్డు ఉండడంతో ఫుడ్‌జోన్ నిర్మాణ పనులు చేపట్టిన క్రమంలో డంపింగ్‌యార్డును కూలగొట్టి ఫుడ్‌జోన్‌కోసం రహదారులను ఏర్పాటు చేశారు.దీంతో అధికారులకు, ప్రజాప్రతినిధులకు ముందు చూపు లేని కారణంగా రూ.4కోట్ల ప్రజాధనం చెత్తపాలైంది. దీంతో మున్సిపాలిటిలో అప్పటి నుంచి డంపింగ్‌యార్డు లేకుండా పోయింది. సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డు లేకపోడంతో ఎక్కడపడితే అక్కడ రహదారుల వెంట కుప్పలు కుప్పలుగా కుమ్మరిస్తున్నారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో కలెక్టర్‌తో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్, మున్సిపల్ అధికారులు కన్నాల శివారులో డంపింగ్‌యార్డు ఏర్పాటు కోస స్థలాన్ని పరిశీలించారు. ప్రజలు వ్యతిరేకించడంతో బూదకలాన్, పాత బెల్లంపల్లి ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించి డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. స్థలాలను పరిశీలించి ఏడాది పూర్తి అవుతున్నప్పటికీ నేటికి డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనం ఇస్తున్నాయి.

దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం...

శివ, బెల్లంపల్లి



ఇళ్ల సమీపంలో చెత్త నిల్వలతో దుర్వాసన వస్తోంది. వర్షాకాలంలో మరింత ఇబ్బంది పడాల్సిన దుస్థితి నెల కొంటోంది. చెత్త కుప్పల నిల్వతో దోమలు తీవ్ర మవు తున్నాయి. అలాగే రహదారుల వెంట చెత్త కుప్పలు ఉండడంతో ముక్కుమూసుకొని ప్రయాణం చేయాల్సి వస్తుంది. సమస్య పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలి.

ఇళ్ల మధ్యలోనే చెత్త, మురుగు...

పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటోంది. పలు వార్డుల్లో రోడ్డు పక్కనే చెత్తచెదారం ప్రజలు వేస్తున్నారు. ఇందుకు కారణం చెత్త సేకరించే వాహనాలు రాకపోవడంతో చేసేదేమిలేక ప్రజలు సమీప ప్రాంతాల్లో చెత్త పారేస్తున్నారు. మున్సిపల్ అధికారులు దీనిపై దృష్టిపెట్టిన పారిశుధ్య నిర్వహణ చేపట్టలేకపోతున్నారు. 34 వార్డుల్లో 13 ఆటోలు, మూడు ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ చేపడుతున్నప్పటికీ డంపింగ్ యార్డు లేకపోవడంతో కాల్‌టెక్స్ ప్రాంతంలోని పంచముఖి హనుమాన్ దేవాలయం ముందు, కోర్టు ముందు ఏర్పాటు చేసిన రైతు బజార్ స్థలంలో, తాళ్లగురిజాల వెళ్లే రహదారుల పక్కన, సింగరేణి క్వార్టర్ల మధ్యగల ఖాళీ స్థలాల్లో చెత్తను డంప్ చేస్తున్నారు. దీంతో దోమలు, చెత్త నుంచి వెలువడే దుర్వాసనతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



బెల్లంపల్లి 12వ వార్డులో ఇళ్ల సమీపంలో చెత్త కుప్పలు

నత్తనడకన ఆస్తి పన్ను వసూలు

(5వ పేజీ తరువాయి)

వేలల్లో బకాయిలు ఉన్న గృహ వినియోగదారులపై చర్యలకు పూనుకోవడం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని భవనంలో కొనసాగుతున్న ఓ ప్రైవేటు కళాశాల ఆస్తి పన్ను రూ. లక్ష పై చిలుకు ఉండగా కొన్నేళ్లుగా చెల్లించి నపాపాన పోలేదు. అయినప్పటికీ అధికారులు తీసుకున్న చర్యలు పెద్దగా ఏమిలేవు. సామాన్య ప్రజలు మూడు నాలుగువేల రూపాయలు ఉంటే తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్న సిబ్బంది వాణిజ్య సముదాయాలపై దృష్టి సారిస్తే మంచిదనే విమర్శలు ఉన్నాయి.

●వడ్డీ రాయితీతో సత్ఫలితాలు...

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు మున్సి పాలిటిలలో ఆస్తి పన్ను(ప్రస్తుత, పాతబకాయిలు) వసూళ్ల కోసం ప్రభుత్వం 90శాతం వడ్డీ రాయితీని ప్రకటించింది. ఈ నెల 31వ తేదీ లోపు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ప్రస్తుత పన్నుతో పాటు పాత బకాయిలు చెల్లించే వారికి రాయితీ అవకాశం కల్పించింది. ప్రభుత్వ ప్రకటనతో ఆస్తి పన్ను వసూళ్లు కొంత మేర సత్ఫలితాలను ఇస్తున్నాయి. మంచిర్యాల కార్పొరేషన్‌కు సంబంధించి పాత బకాయిలు రూ.5.59 కోట్లకు సంబంధించి వడ్డీ రూ.3.24కోట్లు ఉండగా క్యాతన్‌పల్లిలో రూ.0.21కోట్లు, మందమర్రిలో రూ. 0.26కోట్లు, బెల్లంపల్లిలో 0.96కోట్లు, లక్షెట్టిపేటలో 0.07 కోట్లు, చెన్నూర్‌లో 0.26 కోట్ల వడ్డీ బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మేరకు 90శాతం వడ్డీ రాయితీ మంచిర్యాల కార్పొరేషన్‌లో రూ.2.92 కోట్లు, క్యాతన్‌పల్లిలో రూ.0.19 కోట్లు, మందమర్రిలో రూ. 0.23కోట్లు, బెల్లంపల్లిలో రూ.0.83కోట్లు, లక్షెట్టిపేటలో రూ.0.06కోట్లు, చెన్నూర్‌లో రూ.0.23కోట్లు, రాయితీ కింద వడ్డీమాఫీ కానుండడంతో ప్రజల్లో కొంత మేర స్పందన కనిపిస్తోంది. గడువు దగ్గర పడు తుండడంతో గతవారం రోజుల్లో ఘననీయంగా పన్ను వసూలు అయింది. ఆదివారం ఉగాది, సోమవారంరం జాన్ పండుగలు ఉన్నప్పటికీ ఆస్తి పన్ను వసూళ్లకు కార్యాలయాలు తెరిచే ఉంటాయన్న ప్రభుత్వ ప్రకటనతో మరికొంత మొత్తం పన్ను వసూలు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

మన్‌కీ బాత్ కార్యక్రమం

తాండూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 120వ పోలింగ్ బూత్ కిష్టంపేట గ్రామంలో ఆదివారం బీజేపీ నాయకులు మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్ హాజరై మాట్లాడారు. అభివృద్ధిలో భారత్‌ను ప్రపంచ స్థాయిలో నెంబర్ వన్ స్థానంలో తీర్చిదిద్దడమే ప్రధాని మోదీ లక్ష్యమన్నారు. 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజలతో సంప్రదింపులు జరపాలని, తన మనసులోని భావాలను వ్యక్త పర్చడానికి మన్‌కీబాత్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం అందరి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, నాయకులు ప్రదీప్, పుట్టకుమార్, మల్లేష్, నరేష్ పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువ..

నెన్నెల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మన్‌కీబాత్ కార్యక్రమంతో ప్రధాని నరేంద్రమోది ప్రజలకు మరింత చేరువయ్యారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయులు అన్నారు. ఘన్‌పూర్‌లో ఆదివారం మన్‌కీబాత్ ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత వీక్షకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి నెల ఆఖరు ఆదివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో నెల రోజుల పాటు దేశంలో చేపట్టిన కార్యక్రమాల గూర్చి ప్రధాని మోది ప్రజలతో పంచుకుంటారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనులు తయారు చేసే ఇప్పపువ్వు లడ్డు గూర్చి ప్రధాని ప్రస్తావించడం విశేషమన్నారు. సామాన్యులతో అనుబంధాలు, వారి కష్టసుఖాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షులు అంగిళి శేఖర్, నాయకులు మహేష్, సంతష్, వంశీ, శంకర్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల సమస్యలను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



ఇఫ్తార్ విందులో ముస్లింలకు వడ్డిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డబుల్ బెడ్ రూం గృహాల్లో నెలకొని ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. ఆదివారం పట్టణంలోని డబుల్‌బెడ్‌రూం ఇండ్లను సందర్శించారు. లబ్ధిదారులు పలు సమస్యలను విన్నవించారు. విద్యుత్ ఏఈతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ రాజలింగును తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం పనిచేస్తుం దన్నారు. లాటరీ పద్ధతి ద్వారా డబుల్‌బెడ్‌రూం గృహాల లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్, సదానందం యాదవ్, పాల్గొన్నారు.

●ముస్లిం సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని 1వ జోన్ అస్రా మసీదులో ఆదివారం ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. రంజాన్ పండగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. అస్రా మసీదు ముస్లిం పెద్దలు పలు సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. ముస్లిం పెద్దలు మహ్మద్ గులాం, లతీఫ్, ఎండీ ఇసాక్ పాల్గొన్నారు.

వైభవంగా ఉగాది సంబరాలు..



మదాపూర్‌లో పంచాంగ శ్రవణం చదివి వినిపిస్తున్న పురోహితుడు

(5వ పేజీ తరువాయి)

అనంతరం కవి లేదాళ్ల రాజేశ్వర్ రావు రచించిన 'రంగుల పూలు-ముఖాలు' కవితా సంపుటిని ఆవి ష్కరించారు. ఈకార్యక్రమంలో సంస్థ ప్రధానకార్యదర్శి నూటెంకి రవీంద్ర, కవులు తిరుపతి, కుమా రస్వామి, పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలో ప్రజలు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు దేవాలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణలు వినిపించారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ నాయకులు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

కన్నెపల్లి : మండలంలో ఆదివారం ఉగాది పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పలువురు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.

నెన్నెల : పాత తెలుగు సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ నూతన విశ్వావసు నామ సంవత్సరాదికి స్వాగతం పలికారు. రైతన్నలు సాగు పనులకు శ్రీకారం చుట్టారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని ఇచ్చి పుచ్చుకుంటూ.. శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వేమనపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాలకు వెళ్లి ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. రైతులు ఎద్దులకు పూజలు చేసి పనులకు శ్రీకారం చుట్టారు.

జైపూర్ : మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయంలో ఆలయ పూజారి ప్రసాద్ వర్మ పంచాంగ శ్రవణం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోటపల్లి : మండలంలోని అన్ని గ్రామాలు, వసతి గృహాల్లో ఆదివారం విశ్వవసునామ తెలుగు సం వత్సర ఉగాది వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సాయంత్రం దేవాలయాల్లో పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. మండల కేంద్రంలో ని కేజీబీవీ పాఠశాల వసతి గృహంలో విద్యార్థులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

భీమారం: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఆదివారం ప్రజలు ఉగాది పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. ఎల్లమ్మ బోనాలు పోసి పూజలు చేశారు.

చెన్నూరు : చెన్నూరు పట్టణం, మండలంలో ఆదివారం ఉగాది పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇండ్ల ముందు మామిడి తోరణాలను అలంకరించారు. ఉగాది పండగ రోజున మండలం లోని పలు గ్రామాల్లో రైతులు ఎద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.

మందమర్రిరూరల్ : మండలంలో ఆదివారం ఉగాది పండగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ కోరే భాస్కర్ ఆధ్వర్యంలో వినోద్‌శర్మ, అశోక్ వర్మలు పంచాంగ శ్రవణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దండేపల్లి: భక్తులు తెల్లవారుజామున లేచి స్నానాలను ఆచరించి ఇంటిలో ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను చెల్లించు కున్నారు. ఇండ్ల ముంద మామిడి తోరణాలను కటి తెలుగు పం డుగదనంను ఉట్టిపడేలా సాంప్రదాయ వస్త్రాదారణలతో ఉగాది పండుగ వేడుకలను నిర్వహించారు.

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వనాథ ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ అర్చకులు, ప్రజలు పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని ప్రజలు ఆదివారం ఉగాది పండగను ఘనంగా జరుపుకున్నారు. రైతులు పంట చేన్లలో ఎద్దులకు, నాగళ్లకు పూజలు చేసి వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఇండ్లలో ప్రజలు ఉగాది పచ్చడి, బూరెలను చేసుకుని దేవుళ్లకు నైవైద్యంగా సమర్పించారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

భీమారం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లవాగు సమీపంలోని అడవి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు డీఫైఆర్‌వో సుధాకర్ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారించగా పోటు భాస్కర్‌రెడ్డి ఇసుకను తీసుకుని రమ్మని చెప్పడంతో తీసుకెళ్తున్నట్లు తెలిపాడు. పోటు భాస్కర్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు బానేష్, శివకుమార్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అంజలీదేవి

దండేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన మహిళ న్యాయవాది ముత్తె అంజలీదేవి ఎన్నికయ్యారు. మొట్ట మొదటి సారిగా హైకోర్టులో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పోటీ చేసిన ఆమె భారీ మోజార్టీతో గెలుపొందింది. గతంలో ఇదే హైకోర్టులో ఏ జీపిగా పని చేశారు. తెలంగాణ హైకోర్టు మహిళ న్యాయవాదుల సమస్యలు, వారి రక్షణకు సంబంధించిన అంశాలు, తదితర అంశాలపై పరిష్క రించేందుకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. అంజలీదేవి భర్త అక్కల తిరుపతివర్మ ప్రస్తుతం టీపీసీసీ లీగల్ సెల్ వైస్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు.

నేడు ఈద్ ఉల్ ఫితర్

నెన్నెల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పవిత్ర మాసం రంజాన్‌కు ముస్లీంలు అల్విదా పలికారు. నెలవంక కనిపించడంతో 30 రోజుల పాటు పాటించిన ఉపవాస దీక్షలను విరమించారు. సోమవారం రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈద్గాల్లో ప్రార్థ నల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రంజాన్ మాసంలో అలవర్చుకున్న సద్గుణాలను దైనందిన జీవితంలో ఆచరించేందుకు కృషి చేస్తామన్నారు.

శరవేగంగా ఆసుపత్రి భవన నిర్మాణ పనులు

లక్షెట్టిపేటలో ప్రారంభం కానున్న 30పడకల ఆసుపత్రి

లక్షెట్టిపేట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గరీబోళ్లకు సైతం అన్ని హంగులతో ఉచితంగా కార్పోరేట్ తరహా వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. అందులో భాగంగా లక్షెట్టిపేట పట్టణంలో 30పడకల ఆసుపత్రి కోసం నూతన భవనం నిర్మాణం చేపడుతున్నారు. ఈభవనం పనులు చివరి దశకుచేరుకోవడంతో నిరుపేదలు సంతోష పడుతున్నారు. అంతే కాకుండా మన ప్రాంత ఎమ్మెల్యే సైతం ఆసుపత్రిపై ప్రత్యేక శ్రద్ధతో నిత్యం పనులు పర్యవేక్షించడంతో పాటు కలెక్టర్‌తో సహా స్థానిక నాయకులను కూడా ఎప్పటికప్పుడు పనులపై పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.

రూ.8.5కోట్ల నిధులతో ఆసుపత్రి భవన నిర్మాణం..

లక్షెట్టిపేట ఒకప్పుడు తాలుకాగా, నియోజికవ ర్గంగా ఉన్న సమయంలో ఇక్కడ ఆసుపత్రి నిత్యం రోగులతో కిటకిటలాడేది. మన జిల్లా నుంచే కాకుండా పక్కనున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కూడా ఇక్కడికి రోగులు వచ్చి వైద్యం చేయించుకునేవారని



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 30పడకల నూతన ఆసుపత్రి భవనం

చెబుతుంటారు. కానీ అలాంటి ఆసుపత్రి కొంత కాలంగా కేవలం పోస్టుమార్టన్‌లకే అంకితం అయినట్లు ఆరోపణలు రావడంతో 2023 ఏప్రిల్‌లో సుమారు 8.5కోట్ల నిధులతో అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు స్థానిక నాయకులతో కలిసి నూతనంగా 30పడకల ఆసుపత్రి భవనం కోసం భూమిపూజ చేసారు. అప్పటి ప్రభుత్వ పాలనలో పనులు మందకోడిగా సాగినప్పటికి కొత్త ప్రభుత్వం ఏర్పాటు తర్వాత విద్య, వైద్యం అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకున్న ఎమ్మెల్యే తరచూ ఆసుపత్రిపైనే నిఘా పెట్టారు. ఆసుపత్రి భవనం నిర్మాణంలో కొన్ని మార్పులు చేయడంతో పాటు పనుల్లో నాణ్యతను పెంచారు. ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉండాలని, వైద్యులు కూడా పూర్థి స్థాయిలో ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చివరి దశలోకి చేరుకున్న పనులు..

30పడకల ఆసుపత్రి భవనం నిర్మాణం పనులు పూర్తి స్థాయిలో చివరి దశకు చేరుకున్నాయి. ప్రహరీ గోడ, గార్డెన్, మార్చురీ గది కోసం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ప్రత్యేకంగా మరో కోటి 60లక్షల నిధులు కూడా ప్రత్యేకంగా మంజూరు చేయించారు. అందుకు ఈనెల 27వ తారీకు వరకు టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కానుంది. ఆసుపత్రి రెండు అంతస్తుల భవనం కావడం అందులో రోగుల సౌకర్యార్థం 20గదులు, ఔట్ పేషెంట్, క్యాజువాటీలీ గదులు, ఓటి, లేబర్ రూం, ఎక్స్‌రే తోపాటు మెయిల్, ఫిమెల్‌కు వేరు వేరుగా వార్డులను కూడా సిద్ధం చేసారు. ప్రహరీ, సీసీరోడ్డు, ఏసీ ఫిట్టింగ్స్ పైప్‌లైన్ పనులు కూడా పూర్తి అయ్యాయి. కేవలం ఎక్యూపిమెంట్, క్యాడర్ సెంట్ వస్తే ఆసుపత్రి ప్రారంభం చేయడమే ఇక ఆలస్యం.

పనులు దాదాపు పూర్తి అయినట్లే..

డాక్టర్ శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్, లక్షెట్టిపేట



30పడకల ఆసుపత్రి నూతన భవన నిర్మాణం పనులు దాదాపుగా పూర్తి అయినట్లే, ఎక్యూపిమెంట్, క్యాడర్ సెంట్ కోసం కూడా ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకుపోయాము. అవి వస్తే ఆసుపత్రి ప్రారంభం చేస్తాము. ప్రస్తుతం ఆసుపత్రిని పాత ఎంపీడీవో ఆఫీసులో కొనసాగించడం ఇబ్బందిగానే ఉంది.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల జిల్లా వార్తలు

5

సోమవారం 31 మార్చి 2025



దీక్ష స్వీకరిస్తున్న హనుమాన్ భక్తులు

సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సందడి

గూడెంలో హనుమాన్ భక్తుల మాలధారణ

దండేపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం హనుమాన్ భక్తులు మాలధారణ స్వీకరించారు. వచ్చేనెల 10న మహావీర్ జయంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి సుమారు 950మంది పైగా భక్తులు గూడెం ఆలయానికి తరలివచ్చి హనుమాన్ దీక్ష మాలాధారణలను ఆలయ అర్చకులచే వేద మంతోచ్చరణల మధ్య భక్తిశ్రద్ధలతో దీక్షలను భక్తులు స్వీకరించారు. ముందుగా ఆలయ సమీపంలో ఉన్న పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు అనంతరం దేవాలయంకు చేరుకొని హనుమాన్ దీక్ష మాలాధారణను స్వీకరించారు. అనంతరం భక్తులు హనుమాన్ మందిరంలో హనుమాన్ చాలీసా పఠనం చేశారు. అనంతరం సత్యదేవుడి అయ్యప్ప, సాయిబాబా, పంచముఖి అంజనేయస్వాములను దర్శించికొని పూజలు చేశారు. దీంతో గూడెం పరిసర ప్రాంతం అంత కాషాయంతో శ్రీరామ నామస్మరణతో మారుమ్రోగింది.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



రాజుగూడలో గిరిజనులతో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

దండేపల్లి,మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన గూడలలో నివాసం ఉంటున్న ఆదివాసి గిరిజనుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్కే అబ్దుల్ అంబటి లక్ష్మణ్ లు డిమాండ్ చేశారు. మండలంలోని రాజుగూడలో ఆదివారం ఆదివాసి గిరిజనులతో సమావేశం నిర్వహించి గ్రామంలోని నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ గిరిజనులకు ఇందిరమ్మ ఇండ్లు లేక పూరిగుడెలలో నివాసం ఉంటు కాలం వెల్ల దీస్తున్నారు. వారికి సరైన ఇంటి స్థలాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. అర్హులైన గిరినులకు రేషన్‌కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. గ్రామాలోని సరైన రోడ్డు సౌకర్యాలు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేవన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి గిరిజన గూడలల్లో మౌలిక వసతులు కల్పించి ఆదివాసి గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కట్నాక సుజాత, కొమరం లక్ష్మి, కోట్నాక జలపతి, కనక దాపారావు, గిరిజనులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనాలు.. పంచాంగ శ్రవణాలు

వైభవంగా ఉగాది సంబరాలు



రాష్ట్రీయ రహదారి వద్ద పచ్చడి పంపిణీ చేస్తున్న కాపు సంఘం నాయకులు

మంచిర్యాల క్రైం, మార్చి30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో అందరి జీవితాల్లో ఆనందాలు నింపాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం శ్రీవిశ్వావసు ఉగాది సందర్భంగా ఎమ్మెల్యే నివాసం వద్ద పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ ఆధ్వర్యంలో వినిపించారు. ఈ కార్యక్రమంలో బీఎఫ్‌వో ఆశీస్ సింగ్, పోలీసు అధికారులు మహిళ నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద భక్తుల సందడి..

నస్పూర్ : శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినంను సందర్భంగా ఆదివారం నస్పూర్ పట్టణంలోని ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఈ ఏడాది అనుకున్న పనులు నేరవేర్చా లని మొక్కుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ఆదివారం నుంచి శ్రీ రామ నవరాత్రులు పూజలు మొదలు అయ్యాయి. వెంకటేశ్వర దేవాల యంలో సంక్షేప రామాయణం, పంచాంగ శ్రవణం, విష్ణు సహ స్ర నామ పారాయణం చేశారు.

●శ్రీ విశ్వావసు నామ సంవత్సర నూతన క్యాలెండర్‌ను ఆదివారం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో ఆవిష్కరణ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరావు, ప్రధానార్చకులు వంశీకృష్ణ శర్మ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్ : పట్టణంలో ఆదివారం ఉగాది పండుగ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేపట్టారు. స్థానిక కాపు సంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి అందజేశారు. సంఘం అధ్యక్షులు లక్ష్మణ్, పార్వతి రాజిరెడ్డి, సకినాల శంకర్ పాల్గొన్నారు.

●పట్టణంలోని మార్కెట్ సెంటర్లో యూత్ కాం గ్రెస్ ఆధ్వర్యంలో పచ్చడి పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎస్సై రాజశేఖర్ హాజరై పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు గుడ్ల రమేష్, రాయబా రపు కిరణ్, మంద తిరుమల్, శంకర్ పాల్గొన్నారు.

●ప్రజా సేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మార్కెట్ సెంటర్లో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ప్రజల కు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ అధ్య క్షుడు అజీమొద్దీన్ పాల్గొన్నారు.

● పట్టణంలోని వెంకటేశ్వర ఆలయంలో ఆదివా రం పంచాంగ శ్రవనం ప్రధాన అర్చకులు అనంత చార్యులు చదివి వినిపించారు.

గర్మిళ్ల: నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు విజిత్‌కుమార్ దేవుడిని ప్రార్థించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయాల్లో పూజలు చేశారు.

●మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ ఏరియా చౌరస్తాలో వాసవి మెడికల్ ముందు వాకర్‌క్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, బూరెల పంపిణీ చేశారు.

జన్నారం: మండలంలో ఆదివారం ఉగాది పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మార్కెట్‌లో ఉగాది కోలహాలం నెలకొంది. ఉగాది పచ్చడి, పిండి వంటలు చేసుకున్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: శాలీవాహన శకం 1947వ సంవత్సరం శ్రీవిశ్వావసు నామ ఉగాది పండగను పురష్కరించుకుని పట్టణంలోని గుడ్ షెఫర్డ్ పాఠశాలలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం కవులు ఉగాది సాహితీ సమ్మేళనం నిర్వహించారు. పండగ విశేశాన్ని వివరిస్తు కవులు తమ కవితలను వినిపించారు.

(తరువాయి 7లో)



పంచాంగ శ్రవణం వింటున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్



సాయి బాబా ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కుటుంబ సభ్యులు



నస్పూర్‌లోని నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి

ఇచ్చిన హామీలను నెరవేరుస్తా

● నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ చెన్నూరు నియోజకవర్గాన్ని మోడల్ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉగాది పండగను పురస్కరించుకుని పంచాంగ శ్రవణం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ. 40 కోట్ల వ్యయంతో గోదావరినది నుంచి చెన్నూరు ప్రజలకు తాగునీరు అందించేందుకుగాను ప్రణాళికలు తయారు చేశామన్నారు. ఇందులో భాగంగా అమృత్ 2.0 పథకం ద్వారా ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గానికి రెండు టీఎంసీల నీటిని ఇవ్వాలని కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 2 టీఎంసీల నీటిని అందిం చేందుకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

అటవీ శాఖ అనుమతులు రాక చాలా చోట్ల వంతెనల నిర్మాణాలు జరగడం లేదని ఈ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వ భూములను అటవీ శాఖకు ఇచ్చి వంతెనల నిర్మాణాలకు అనుమ తులు తీసుకురావాలని కోరానని తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై ఆరా తీస్తూ ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు కృషి చేయాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న బైపాస్ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించి రహదారిని పూర్తి చేయిస్తానని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ అందరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి



ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ పంపిణీ

గర్మిళ్ల, మార్చి30 (ఆంధ్రజ్యోతి): సేవే లక్ష్యం ప్రేమే మార్గం అనే నినాదంతో ప్రతీ ఒక్కరు తమ వంతు బాధ్యతగా సేవ చేయడానికి అందరు ముందుకు రావాలని ప్రతీ ఒక్కరు సేవా దృక్పథం అల వర్చుకోవాలని ఏబీపీపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు డాక్టర్ చుంచు రాజ్ కిరణ్ అన్నారు. ఐబీ చౌరస్తా ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట అఖిలభారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమంలో భాగంగా ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ కార్యక్రమం చేపట్టారు. వేసవి కాలనాన్ని దృష్టిలో ఉంచుకొని నగునూరి అమరావతి జ్ఞాపకార్థం వారి కుమారులు సాయి లచ్చన్న, శ్రీకాంత్ ముందుకు వచ్చి వాటర్ పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. మహత్తర కార్య క్రమానికి ముందు వచ్చిన వారి కుటుంబ సభ్యులను ఏబీపీపీ నేష నల్ సీఈవో తిరుమలరావు అభినందించారు.



నత్తనడకన ఆస్తి పన్ను వసూలు

- మంచిర్యాల సహా అన్ని మున్సిపాలిటీలది అదే తీరు
- కార్పొరేషన్ పరిధిలో కేవలం 53శాతం వసూలు నమోదు
- కఠిన చర్యలు తీసుకుంటున్నా ఫలితం శూన్యం
- 90శాతం వడ్డీమాఫీతో కాస్త ఉపశమనం

మంచిర్యాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను వసూలు నత్తనడకన సాగుతోంది. మున్సిపల్ అధికారులు బకాయిదారులపై కఠిన చర్యలకు పూనుకుంటున్న పరిస్థితిలో మార్పు రావడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం వడ్డీమాఫీ కొంతమేర సత్ఫలితాలను ఇస్తుండగా మొత్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్లలో యంత్రాంగం వెనుకబడిందని చెప్పవచ్చు. గతంలో ఆస్తిపన్ను వసూలుకు మున్సిపాలిటిలు పెద్ద ఎత్తున ప్రచారం కల్పించేది. ఆటోల ద్వారా మైక్‌ల్లో ప్రకటనలు ఇస్తుండేవారు. వినియోగదారులకు మున్సిపాలిటిలు ఆస్తి పన్నుకు సంబంధించి డిమాండ్ నోటీసులు జారీ చేసేది.

మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయడం ద్వారా చర్యలకు ఉపక్రమించేవి. అలా ఆస్తి పన్ను వసూళ్లకు అధికారులు వివిధ ప్రయోగాలు చేసే వారు. కొంత కాలంగా వినియోగదారులకు అసలు డిమాండ్ నోటీసులే జారీ చేయకపోగా ప్రచారం కూడ నిర్వహించడం లేదు. కేవలం మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ తమ వద్ద ఉన్న కాగి తాలతో ఆస్తిపన్ను వసూలు చేస్తున్నారు. దీంతో ఆశించినమేరు పన్ను వసూలుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

వినియోగదారులకు సమాచారం ఇవ్వని వైనం...

ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి ఏ వినియోగదారుడు ఎంత పన్ను చెల్లించాలనేదానిపై వారికి అ వగాహన ఉండడం లేదు. సెల్‌ఫోన్‌లో సంక్షిప్త సమాచారంగాని నోటీసుల పంపకం ద్వారాగాని ఎంత పన్ను చెల్లించాల్సి ఉందో సమాచారం ఇవ్వడం లేదు. దీంతో ఇంటికి వచ్చే సిబ్బంది కాగితాల్లో చూపించే లెక్కలపైనే ఆధారపడి ఉండాల్సి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే ఇంటింటికి నోటీసులు సరఫరా చేస్తే అందులో ఇంటి కొలతల ఆధారంగా పన్ను విధించారోలేదో తెలుసుకునే అవకాశం వినియోగదారుడికి కలుగుతుంది. అలా చేయకపోవడంతో ఆస్తి పన్ను వివరాలు తెలుసుకునేందుకు మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో సుమారు 40 కోట్ల బకాయిలు...

జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్‌తో పాటు క్యా తన్‌పల్లి, మంద మర్రి, బెల్లంపల్లి, లక్షెట్టిపేట, చెన్నూర్ మున్సిపాలిటీల్లో మొత్తంగా రూ. 40కోట్ల మేర పన్ను బకాయిలు ఉన్నట్లు సమాచారం. ఒక మంచిర్యాల మున్సి పల్ కార్పొరేషన్ పరిధిలోనే రూ. 26.88 కోట్ల బకాయిలు ఉన్నాయి. మున్సిపల్ కార్పొరేషన్‌లో 45,372 నివాస, వాణిజ్య గృహాలు ఉండగా వీటికి సంబంధించి రూ.26.88 కోట్ల బకాయిలు ఉండగా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో 12,159 గృహాలకుగాను రూ.4.01 కోట్లు, మందమర్రి మున్సిపాలిటీలో 13,680 గృహాలకు రూ. 2.30కోట్లు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 15,408 గృహాలకు రూ.4.24కోట్లు, లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 5,988 గృహాలకు రూ.1.69కోట్లు, చెన్నూర్ మున్సిపాలిటిలో 7,237 గృహాలకు గాను రూ. 2.86 కోట్ల పన్ను చెల్లించాల్సి ఉంది. ఆస్తి పన్ను బకాయిల్లో ఈనెల 29వ తేదీ వరకు 53శాతం వసూలు అయినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలో పన్ను వసూల్లు నెమ్మదిగా సాగుతున్నట్లు తెలుస్తోంది. మంచిర్యాల కార్పొరేషన్‌కు సంబంధించి కరెంట్ డిమాండ్ (చెల్లించాల్సిన పన్ను) రూ.17.03 కోట్లు ఉండగా పాత బకాయిలు రూ.5.59కోట్లు ఉంది. ఆస్తి పన్ను బకాయిల వసూళ్ల కోసం మున్సిపల్ అధికారులు ఈ సంవత్సరం గతంలో ఎన్నడూ లేని విధంగా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. సీసీ నగర్‌లో ఓ ఇంటి యజమాని రూ.4వేలు పైచిలుకు బకాయి ఉండడంతో సిబ్బంది ఆయన ఇంటికి తాళం వేసి సీల్‌వేశారు. అయితే లక్షల్లో బకాయిలు ఉన్న వాణిజ్య సముదాయాలపై కఠిన చర్యలు తీసుకోని సిబ్బంది..

మిగతా 7వ పేజీలో

క్రీడల్లో రాణిస్తున్న సింగరేణి కార్మికుడు..

మందమర్రిటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు సింగరేణి కార్మికుడిగా మరో వైపు తాను ఎంచుకున్న క్రీడల్లో అద్భుతంగా రాణిస్తూ అనేక రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయితో పాటు కోల్ ఇండియాలో పతకాలు సాధించాడు ఈ యువ కార్మిక క్రీడాకారుడు. విద్యార్థి దశ నుంచి సింగరేణి ఉద్యోగంలో చేరి క్రీడల్లో తనకు సాటి ఎవరు లేరని సాధిస్తున్న పతకాలతో సవాలు విసురుతున్నాడు. మందమర్రి ఏరియాలోని కేకే5 గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్న కార్మిక క్రీడాకారుడు శనిగారపు క్రాంతి కిరణ్. బీటెక్ ఎంబీఏ విద్య వరకు ఉన్నత విద్య పూర్తి చేసిన సందర్భంలో అథ్లెటిక్స్‌తో పాటు హాకీలో అద్భుతంగా రాణిస్తున్నాడు. ఆలిండియా యూనివర్సిటీ స్థాయిలో అథ్లెటిక్స్‌లో అనేక ప్రథమ బహుమతులు కూడా సాధించాడు. కిరణ్ 2024-25 రెండు సంవత్సరాల్లో మందమర్రి ఏరియా కార్మిక వార్షిక క్రీడల్లో తన సత్తాచాటాడు. వరుసగా 2024-25 సంవత్సరంలో ఏరియా చాంపియన్‌షిప్‌గా బహుమతిని అందుకున్నాడు.



మందమర్రి అధికారుల చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న క్రాంతి కిరణ్(ఫైల్)

ఇళ్ల పట్టాలు ఇవ్వకపోతే క్యాంప్ ఆఫీస్ ముట్టడి

బెల్లంపల్లి, మార్చి30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇండ్లు నిర్మించుకున్న వారి పెండింగ్‌లో ఇళ్ల పట్టాలను వెంటనే ఇవ్వాలని లేని యెడల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు ముట్టడి చేస్తామని ఎంసీపీఐయు జిల్లా సహాయక కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఎంసీపీఐయు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని 34 వార్డుల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొంతమంది మందికి మాత్రమే ఇండ్ల పట్టాలు అందించారని ఎంతో మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వలేదన్నారు. పలువురి ఇళ్ల పట్టాల కోసం బ్యాంకుల్లో డబ్బులు చెల్లించారని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం అవుతున్న ఇండ్ల పట్టాలు ఇవ్వాలేదన్నారు. డబ్బులు చెల్లించిన వారు పట్టాలు వస్తాయోలేదోనని ఆందోళన చెందుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి బ్యాంకుల్లో డబ్బులు చెల్లించిన వారికి పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఎంసీపీ ఐయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.

ఇద్దరు విద్యార్థులు ఎంపిక

జన్నారం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : సాంఘీక సంక్షేమ మైనార్టీ పాఠశాలలో చేరడానికి ఎంపిక చేసిన జాబితాను సంబంధిత అధికారులు విడుదల చేశారు. ఫలితాల్లో స్పెషల్ కేటగిరీ కింద మండలంలోని అక్కపల్లి గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థులు ముత్యం నిహాల్ శర్మ రాష్ట్రస్థాయి లో 504 ర్యాంకు, జహాన్ ఖాన్ 1642 ర్యాంకు సాధించారు. గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యను అభ్యసించనున్నట్లు ఎంఈవో విజయ్ కుమార్ తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.


అలుపెరగలేదు.. ఒక్కటితో ఆగలేదు

- నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఆవడం యువకుడు
- సుమంత్‌గౌడ్‌కు గ్రూప్-1లో 286వ ర్యాంకు



నెన్నెల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నెన్నెల మండలం ఆవడం గ్రామానికి చెం దిన మండల సుమంత్ గౌడ్ నాలుగు నెల ల్లో వరుసగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించుకున్నారు. గ్రూప్స్‌లో వరుసగా ఉద్యోగాలు సాధిస్తూ విజయ పరంపర కొనసాగిస్తున్నారు. ఎలాంటి కోచింగ్ లేకుండా సొంతంగా ప్రిపేరై ర్యాంకులు సాధించి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆదివారం వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 286వ ర్యాంకు, మల్టీ జోన్‌లో 126వ ర్యాంకు సాధించారు. గతంలో గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4లో సత్తా చాటారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆవడం గ్రామానికి చెందిన టీవీ మెకానిక్ మురళీగౌడ్-ఉషారాణి దంప తులకు ఇద్దరు సంతానం. చిన్న వాడైన సుమంత్ మంచిర్యాలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి వరకు చదువుకున్నారు. హైదరాబాదులోని ప్రైవేటు కాలేజీలో ఇంటర్ పూర్తి చేసి, ధన్‌బాద్ ఐఐటీలో ఇంజనీరింగ్ చదివి ఐదేళ్ల పాటు మైనింగ్ ఇంజనీర్‌గా పనిచేశారు. ఆ ఉద్యోగాన్ని వదిలేసి గ్రూప్స్‌కు ప్రిపరేషన్ ప్రారంభించారు. మొదట గ్రూప్-4 రాయగా అందులో రాష్ట్ర స్థాయిలో 88వ ర్యాంకు రావడంతో జీహెచ్ఎంసీలో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం వచ్చింది. విధులు నిర్వహిస్తూనే పరీక్షలకు సన్నద్ధమయ్యారు. గ్రూప్-2లో రాష్ట్ర స్థాయిలో 172వ ర్యాంకు సాధించారు. గ్రూప్-3లో రాష్ట్ర స్థాయిలో 102వ ర్యాంకు దక్కించుకున్నారు.

166 ర్యాంకు సాధించిన విష్ణునందన్



దండేపల్లి: మండల కేం ద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాత రమేష్-కేసరి దంపతుల కుమారుడు పాత విష్ణునందన్ గ్రూప్-1 ఫలితాలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో 166 ర్యాంకు సాధించాడు. గతంలో గ్రూప్-4లో ఉద్యానవనశాఖ ఉద్యోగం సాధించాడు, ప్రస్తుతం హైదరాబాద్ ఉద్యానవన శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూనే, గ్రూప్-1 కు ప్రిపేర్ అయ్యాడు. ఆదివారం విడుదలైన ఫలితాలల్లో రాష్ట్రస్థాయి 166వ ర్యాంకు సాధించాడు. పట్టుదలతో చదువుకుంటే ఏదైనా సాధించవచ్చని విష్ణునందన్ అన్నాడు.